

ఏకగ్రీవంపై ఆశలు

- ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10 లక్షల ప్రోత్సాహం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటన
- గత ప్రభుత్వంలో రావాల్సిన బకాయిలు రూ.7.35 కోట్లు



ఎన్నికల్లో ఏకగ్రీవమైన చింతలమానేపల్లి మండలంలోని ఆడెపల్లి పంచాయతీ

ఆసిఫాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు త్వరలోనే నోటిఫికేషన్ రానున్నది. మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించడానికి కసరత్తు మొదలైంది. పాత పద్ధతిలో 50శాతం కోటా మించకుండా రిజర్వేషన్లు ఖరారు చేశారు. పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని పల్లెల్లో పోటీకి సిద్ధమైన ఆశావహులు హడావుడి జోరందుకుంది. ప్రభుత్వం డిసెంబరులో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసే విధంగా ఏర్పాట్లు చేస్తోంది. వివిధ రాజకీయ పార్టీలు కూడా స్థానిక ఎన్నికలపై దృష్టి పెట్టడంతో పల్లెల్లో రాజకీయ సందడి మొదలైంది. పంచాయతీ ఎన్నికల్లో పదవులు కైవసం చేసుకోవాలని ఆశతో ఉంటే గ్రామాల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాటలతో మరోసారి ఏకగ్రీవ పంచాయతీలు చర్చకు దారితీసింది.

● అప్పులు చేసి అభివృద్ధి పనులు..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఏకగ్రీవ ఆశలు ముందుకు తీసుకొచ్చింది. వ్యవసాయ, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రజలంతా చర్చించుకొని సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ఆ పంచాయతీలకు 10 లక్షల రూపాయల గ్రాంట్ ఇస్తామని వెల్లడించారు. కాని జిల్లాలో ఏకగ్రీవాలపై అంతగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో 2019 ఎన్నికల్లో ఏకగ్రీవ పంచాయతీలకు 10 లక్షల రూపాయల ప్రోత్సాహం ఇస్తామని ప్రకటించి నయా పైసా కూడా ఇవ్వలేదు. పదవీకాలం ముగిసినా పోత్సాహం అందలేదు. సర్పంచ్, పాలకవర్గం ఏకగ్రీవ నిధులు, ప్రభుత్వం అందించే నిధులతో బిల్లుల చెల్లింపులో ఇబ్బం దులు ఉండవని భావించి అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసిన వారికి నిరాశే మిగిలింది. బిల్లులు రాక కనీసం అందిస్తామన్న ప్రోత్సాహం నిధులు రాక అప్పుల పాలయ్యారు.

● గడువు ముగిసి రెండేళ్లయినా..

2019లో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 500 జనాభా కలిగిన తండాలను, గూడాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. వాటిని అభివృద్ధి పథంలో నడిపించాలనే సంకల్పంతో గ్రామ పంచాయతీలను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే నజరానా అందిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 335 పంచాయతీలు ఉండగా 49 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం చేసుకున్నారు. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం 10 లక్షల రూపాయల నజరానా ప్రకటించడంతో పాటు ఎమ్మెల్యే నిధుల నుంచి అదనంగా మరో ఐదు లక్షల రూపాయలు కలిపి మొత్తం 15 లక్షల రూపాయల నజరానాను ప్రకటించింది. దీంతో జిల్లాలో మొత్తం రూ7.35 కోట్ల నజరానాలు రావాల్సి ఉంది. 2019 గ్రామ పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసిపోయి రెండేళ్లవుతున్నా నిధులు మాత్రం విడుదల కాలేదు.

● గత ఎన్నికల్లో 49 పంచాయతీలు ఏకగ్రీవం..

2019 ఎన్నికల్లో జిల్లాలోని 335 గ్రామపంచాయతీలు ఉండగా 286 గ్రామపంచాయతీలకు మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించారు. 49 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. కౌటాల మండలంలో తలోడి, కన్కి, శిర్సా నవేగాం గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. బెజ్జూరు మండలంలో అంబగట్టు, సుస్మీర్, కాటేపల్లి, తలాయి, సులుగుపల్లి, అందుగుల గూడ, కుకుడ, పెంచికలపేట మండలంలో కొండపల్లి, మొర్లిగూడ, దహెగాం మండలంలో ఐనం, దిగిడ, రాంపూర్, చింతలమానేపల్లి మండలంలో ఆడెపల్లి, తిర్యాణి మండలంలో భీంజిగూడ, గోవెన, మర్కగూడ, గోపెర(నాగుగూడ), మొర్రిగూడ, గుండాల, ముల్కల మంద పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి.

రెబ్బెన మండలంలో తక్కళ్లపల్లి, కాగజ్‌నగర్ మండ లంలో అనుకోడ, భట్టుపల్లి, ఈసుగాం, జగన్నాథ్‌పూర్, లైన్‌గూడ, రేగులగూడ, కెరమెరి మండలంలో కరంజీ వాడ, రింగన్‌ఘాట్, వాంకిడి మండలంలో దాబా, నవేగూడ, పాటగూడ, పిప్పర్‌గొంది, సవ్వాతి, సిర్పూర్ (యూ) మండలంలో బాండేయర్, సీతాగొంది, లింగా పూర్ మండలంలోని గుమ్నూర్(బి), చిన్నదాంపూర్, జైనూరు మండలంలో రాంనాయక్‌తండా, దుబ్బగూడ, మార్లవాయి, పౌరా, పవర్‌గూడ, రాశిమెట్ట, ఊసేగాం పంచాయతీలు ఏకగ్రీవమై ప్రోత్సాహనికి అర్హతగా నిలిచాయి. కానీ ప్రోత్సాహక నిధులు మాత్రం రాలేదు. మరోసారి ఏకగ్రీవ పంచాయతీల ప్రోత్సాహక అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చింది.

ఏడీఈగా ఇర్ఫాన్ అహ్మద్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఇర్ఫాన్ అహ్మద్

కాగజ్‌నగర్, నవంబరు 24: కాగజ్‌నగర్ ఏడీఈగా ఇర్ఫాన్ అహ్మద్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సిర్పూరు(టి) విద్యుత్ శాఖలో ఏఈగా పనిచేస్తున్న ఇర్ఫాన్ అహ్మద్ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. విద్యుత్ సమస్య పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. పెండింగ్ సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

డాక్టర్ నియామకం

బెజ్జూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం డాక్టర్ తాళ్లపల్లి శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికే ఇద్దరు డాక్టర్లను ప్రభుత్వం నియమించగా అదనంగా మరో డాక్టర్ నియామకంతో వైద్య సేవలు ఇబ్బందులు లేకుండా ఉంటుందని మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మర్తిడి గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఇటీవల ఎంబీబీఎస్ పూర్తిచేసుకొని సొంత మండలంలోనే డాక్టర్ బాధ్యతలు చేపట్టారు.

ఈఈకి సన్మానం

జైనూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం జిల్లా పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)గా బాధ్యతలు స్వీరించిన అడె ధర్మేందర్‌ను జైనూర్ మండల సామాజిక సేవ సంఘం నాయకులు ఈఈని సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు విశాల్ కెంద్రే, మేస్రాం శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

పంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారు

ఆసిఫాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు అధికారులు రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేశారు. రిజర్వేషన్లకు సంబంధించిన జీవో 46ను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేయడంతో అధికారులు రిజర్వేషన్ల ప్రక్రియను చేపట్టారు. జిల్లాలో 335 గ్రామపంచాయతీలు ఉండగా ఇందులో ఎస్టీలకు 198, ఎస్సీలకు 32, బీసీలకు 20, జనరల్‌కు 85 స్థానాలను కేటాయించారు. జిల్లాలోని 335 గ్రామపంచాయతీల్లో 2,874 వార్డు స్థానాలు ఉన్నాయి. ఇందులో ఎస్టీలకు 1,292, ఎస్సీలకు 226, బీసీలకు 231, జనరల్‌కు 1125 స్థానాలను కేటాయించారు.

ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సామర్థ్యాల అభివృద్ధి కోసం ట్రైబల్ వెల్ఫేర్ పీజీ హెడ్‌మాస్టార్లు, పీడీలకు నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకురాలు రమాదేవి సూచించారు. అయిదు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణను సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. నూతన విద్యావిధానాల పోకడలను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు, నేర్చుకొని విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని కోరారు. సమావేశంలో ఏసీఎంఓ ఉద్ధవ్, లక్ష్మయ్య, జీసీడీఓ శకుంతల, ఉపాధ్యాయులు షేకు, జీవరత్నం, అమరేందర్‌రెడ్డి, మహేశ్వర్‌రావు, హరికృష్ణ, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి కోరారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 25న ప్రధానమంత్రికి, నెలాఖరు వరకు ఎంపీలకు ఈ-మెయిల్ ద్వారా వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఇందూరావు, రమేష్, ప్రీతి, రవి, శ్రీనివాస్, శివ, రాజయ్య, సంతోష్, ఆరీఫ్, నవీన్, రామ్మోహన్, అతిక్, గోవిందరావు, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పడి పూజ

బెజ్జూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని మర్తిడి గ్రామానికి చెందిన చిలువేరు శ్రీనివాస్ ఇంట్లో ఆదివారం రాత్రి అయ్యప్ప పడి పూజ ఘనంగా నిర్వహించారు. సంఘనభట్ల నరహరి శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజ వైభవంగా కొనసాగింది. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డిప్యూటీ కలె క్టర్ జాస్తిన్ జోల్‌తో కలిసి దరఖాస్తులను సోమవారం స్వీకరిం చారు.

జైనూరు మండలం నందునాయక్ తండాకు చెందిన సుజాత తన భర్త మరణించినందు ఆయన పేరిట ఉన్న భూమిని తన పేరిట విరాసత్ చేయాలని అర్జీ సమర్పించారు. జిల్లా కేంద్రానికి చెందిన సత్యవతి తనకు రేషన కార్డు మంజూరు చేయాలని, దహెగాం మండలం లగ్గాం గ్రామానికి చెందిన భాస్కర్‌గౌడ్ తాను గీత కార్మికుడినని లైసెన్స్ మంజూరు చేయాలని, తిర్యాణి మండలం చెలిమెల కోలాంగూడకు చెందిన గంగారాం తన పట్టా భూమిని ఇతరులు కబ్జా చేసినందున విచారణ చేసి న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన పర్వీన్ సుల్తానా తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, సిర్పూర్(టి)కి చెందిన అమీనోద్దీన్ తాను బోర్ మెకానిక్ పని చేస్తున్నానని తనకు రావాల్సిన నాలుగు నెలల వేతనం ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నారు.

రెబ్బెన మండలం జక్కులపల్లి గ్రామస్థులు తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అర్జీ పెట్టుకున్నారు. సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రిజైండర్లను త్వరగా సమర్పించాలి

దిన పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్త కథనాలపై సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వ ర్‌రావులతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం ని ర్వ హించారు. సమావేశంలో డిప్యూటీ క లెక్టర్ జాస్తిన్ జోల్, జిల్లా సంబందాల అధికారి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో రాణించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయి షూటింగ్ బాల్ క్రీడా పోటీల్లో ఆసిఫాబాద్ జిల్లాకు బంగారు పతకం సాధించిన సందర్భంగా క్రీడాకారులను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అభినందించారు. అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా యువజన క్రీడాధికారి అశ్వక్ అహ్మద్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి ఉన్నారు.

మహిళలకు వడ్డీ లేని రుణాల చెక్కులు అందించాలి

- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

ఆసిఫాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 25 లోగా మహిళలకు వడ్డీ లేని రుణాల చెక్కులు పంపిణీ చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం ములుగురు జిల్లా నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సృజన, సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్‌తో కలిసి వీసీ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి అధికారులు, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ నెల 25న మహిళలకు చీరల పంపిణీతో పాటు అన్ని నియోజ కవర్గ కేంద్రాల్లో మహిళలకు వడ్డీ లేని రుణాల చెక్కులు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీకి ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీసీ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా సమాఖ్య సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25న జిల్లాలోని కాగజ్‌నగర్ ఆసిఫాబాద్ డివిజన్ కేంద్రాలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులతో మహిళలకు వడ్డీ లేని రుణాల చెక్కులు పంపిణీ కార్యక్రమం పండగ వాతావరణంలో నిర్వహించే దిశగా ఏర్పాటు చేస్తామన్నారు. డిప్యూటీ కలెక్టర్ జాస్తిన్ జోల్, జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ డే

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్గుడ సమీపంలో గల ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్‌సీసీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శారద మాట్లాడుతూ ఎన్‌సీసీ కేడెట్‌లు దేశభక్తి, క్రమ శిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. సామాజిక సేవ వంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించే రాజ్య స్తరియ బాల్ వైజ్ఞానిక ప్రదర్శనలను సోమవారం ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు తమ ప్రాజెక్టులతో తరలి వచ్చి ప్రదర్శనలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కో కన్వీనర్ దేవాది, సైన్స్ అధికారి మధుకర్, ఎంఈవో సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: మండల కేంద్రంలోని భారతి గ్రామర్ పాఠశాల విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్నారని కరస్పాండెంట్ పి నరేందర్ తెలిపారు.

పాఠశాల విద్యార్థులకు కరాటే శిక్షణ



కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులు

వాంకిడి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం నుంచి పీఎం శ్రీ పథకం కింద కరాటే శిక్షకుడు చాపిడి కుమార్ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు నటరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు మూడునెలల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హై లెవల్ వంతెన నిర్మాణానికి భూమి పూజ

చింతలమానేపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేతిని-దిందా వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి కాంట్రాక్టర్, స్థానిక బీజేపీ నాయకులు సోమవారం భూమి పూజ చేశారు. కొన్నేళ్లుగా వాగుపై వంతెన నిర్మించాలని గ్రామస్థులు పోరాటం చేస్తున్నప్పటికీ అటవీ అనుమతులు అడ్డంకిగా ఉండడంతో ఇన్నాళ్లు నిర్మాణంలో జాప్యం జరిగింది. ప్రస్తుతం అటవీ శాఖ అడ్డంకులు పూర్తిగా తొలగిపోవడంతో పాటు ప్రధాన మంత్రి సడక్‌యోజన కింద వంతెన నిర్మాణానికి మూడు కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి. కాంట్రాక్టర్లు రవీందర్‌రావు, మదన్ మోహన్‌రావు, నాయకులు మల్లయ్య, రామన్న, రవి, అంకులు, చంద్రయ్య, లచ్చన్న, శేఖర్, హనుమంతు, కోటేష్ తదితరుల పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ కార్యవర్గం ఎన్నిక

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పీడీఎస్‌యూ కార్యవర్గంను సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ సమీర్, ప్రధాన కార్యదర్శిగా తరుణ్, ఉపాధ్యక్షులుగా మల్లేష్, సహాయ కార్యదర్శిగా నందిని, కోశాధికారిగా తపస్సుస్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన ఆత్రం సుగుణ



డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణను సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షురాలిగా నియమితులైన ఆత్రం సుగుణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీసీసీ మాజీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. తరువాత ఇద్దరు జిల్లా పార్టీ అభివృద్ధి, కార్యకర్తల సమీకరణ, రాబోయే కార్యక్రమాల ప్రణాళికపై చర్చించారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ తనపై ఉంచిన విశ్వాసానికి పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అనీల్‌గౌడ్, చరణ్, శ్యాం, ప్రశాంత్, దీపక్, రవీందర్, మహేష్‌గౌడ్, తిరుపతి, శ్రీనివాస్, తిరుపతి, బబ్లు తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా యూనివర్సిటీ పోటీలకు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని గిరిజన గురుకుల కళాశాల విద్యార్థినులు ఉష ఆరుణ్య, పుష్పలతలు ఈ నెల 17న పంజాబ్‌లోని ఎల్‌పీయూ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా యూనివరిసటీ బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శారద తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తో పాటు ఏఓ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ సంధ్యారాణి, పీడీ హారికలు అభినందించారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభం

జైనూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పులాజీబాబా జిన్నింగ్ మిల్లులో మార్కెట్ కమిటీ అధ్వర్యంలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ పూజలు చేసి పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. మాజీ ఎంపీపీ కొడప ప్రకాష్, మాజీ వైస్‌ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, సీపీవో నరేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సేక్ అబ్దుల్ ముకీద్, మార్కెట్ డైరెక్టర్లు రాధాబాయి, పంద్ర సేకు, కనక గంగారాం హైదర్ పాల్గొన్నారు.

మద్యం షాపు రద్దు చేయాలని రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న గ్రామస్థులు

కాగజ్‌నగర్, నవంబరు 24: కాగజ్‌నగర్ ఈసుగాం గ్రామ పంచాయతీలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వైన్ షాపు కేటాయించారని వెంటనే రద్దు చేయాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ఈసుగాం చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాచర్ల వినోద, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తిక్ మాట్లాడుతూ వైన్‌షాప్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండు చేశారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ముంజం ఆనంద్ కుమార్, మమతరానా, కాజల్ బిశ్వాస్, సుచిత్ర మండల్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌టీడబ్ల్యూటీయూ సభ్యత్వ నమోదు

బెజ్జూరు/కౌటాల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు, కౌటాల మండల కేంద్రంలో టీఎస్‌టీడబ్ల్యూటీయూ(తెలంగాణ స్టేట్ ట్రైబల్ వెల్ఫేర్ టీచర్స్ యూనియన్) నాయకులు సభ్యత్వ నమోదును సోమవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్, అసోసియేషన్ అధ్యక్షుడు మాదవరావు, సభ్యులు శ్యాంరావు, పెంటయ్య, సాగర్, ధర్మయ్య, మధుబాల, రాజేంద్రప్రసాద్, కన్నయ్య, సారిక, పద్మజ, నానాజీ, సోమయ్య, నాందేవ్, గోవర్ధన్, పోచాని, శ్యాంరావు, నందరాం, భిక్షమయ్య, వెంకటేష్, అనంత్, ధర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడి మృతి

జైనూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉషేగాం గ్రామానికి చెందిన మేస్రాం అనిల్ కుమార్(28) అనే యువకుడు సోమవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు మృతుడి బంధువులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. అనిల్‌కుమార్ కొద్దిరోజుల నుంచి హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈక్రమంలో జ్వరం రావడంతో అతని స్నేహితులు బాధితుడిని ఆదిలాబాద్‌కు పంపించారు. తాము ఆదిలాబాద్ వెళ్లి తమ కుమారుడిని ఉషేగాం గ్రామానికి తీసుకురాగా మృతి చెందాడని తెలిపారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

వాంకిడి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం పీవీఆర్ కన్స్ట్రక్షన్స్ ప్రశాంత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా దుర్వినియోగం, హ్యాకింగ్, ఓటీపీ ఫ్రాడ్, ఫేక్ కాల్స్, ఆన్‌లైన్ గేమింగ్, స్కామ్స్ వంటి సైబర్ నేరాలు యువతను ఎక్కువగా లక్ష్యం చేస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రయ్య, అధ్యాపకులు తిరుపతి, కిరణ్, నాయకులు విలాస్, శివాజీ, గణేష్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రశాంత్

కలెక్టర్, జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ



కలెక్టర్, జిల్లా జడ్జికి పూల మొక్కలు అందజేస్తున్న ఎస్పీ నితిక పంత్

ఆసిఫాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కుమరంభీం జిల్లా ఎస్పీగా నితిక పంత్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేష్ దోత్రేతో పాటు జిల్లా కోర్టులో ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి ఎంవీ రమేష్‌ను ఎస్పీ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందించారు.


విద్యార్థులకు సన్మానం

బెజ్జూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆసిఫాబాద్‌లో జరిగిన జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన సోమిని విద్యార్థినులను సోమవారం ఉపాధ్యాయులు సన్మానించారు. సీనియర్ విభాగంలో 400 పరుగు పందెం పోటీల్లో విగ్నేష్ జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించగా, 200 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ బహుమతి సాధించారు. అలాగే జూనియర్ విభాగంలో మహేష్‌బాబు 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ బహుమతి సాధించారు. వాలీబాల జూని యర్ విభాగంలో సిడాం సాయికుమార్, అజయ్ ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భిక్షపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్లు అందజేత

కౌటాల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కౌటాల సర్కిల్ పరిధిలో ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు సోమవారం సర్కిల్ కార్యాలయంలో సీఐ సంతోష్, ఎస్సై చంద్రశేఖర్ అందజేశారు. ముత్తంపేటకు చెందిన సంతోష్, కౌటాలకు చెందిన కరుణాకర్, బెజ్జూరుకు చెందిన ఓంప్రకాష్, కౌటాలకు చెందిన అనంతుల శ్రీనివాస్, గురుడుపేటకు చెందిన సత్తయ్య ఫోన్‌లు పోగొట్టుకుని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ ద్వారా గుర్తించి బాధితులకు అందజేసినట్లు తెలిపారు.

నిధులు సాకారం.. పనులకు శ్రీకారం



కంకర తేలిన కాగజ్‌నగర్-సిర్పూర్(టి) ప్రధాన రహదారి

- హ్యామ్ పథకం కింద రోడ్ల నిర్మాణానికి రూ.41 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఐదు రోడ్లకు సర్వేలు పూర్తి చేసిన అధికారులు
- తీరనున్న గ్రామీణ వాసుల కష్టాలు

కాగజ్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారులు కొత్త రూపును సంతరించుకోనున్నాయి. రవాణా సౌకర్యం మెరుగు పర్చేందుకు రాష్ట్రప్రభుత్వం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(హ్యామ్) కింద కుమరంభీం జిల్లాకు 41 కోట్ల రూపాయల నిధులను విడుదల చేసింది. ఈ మేరకు జిల్లా అధికారులు కూడా సర్వేలు పూర్తి చేశారు. టెక్నికల్ అనుమతి పొందగానే, టెండరు నిర్వహించి పనులు ప్రారంభించేందుకు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఈ నిధులతో ఉట్నూరు నుంచి ఆసిఫాబాద్ వరకు 59 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు రెన్యూవల్ చేయనున్నారు. అలాగే సిర్పూరు నియోజకవర్గంలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు నుంచి సిర్పూరు(టి) వరకు 29 కిలోమీటర్లు, సిర్పూరు(టి) నుంచి మాకొడి వరకు 11 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.

చింతలమానేపల్లి మండలం బాబాసాగర్ నుంచి గూడెం వరకు 16 కిలోమీటర్ల, దహెగాం మండలం కల్వాడ నుంచి ఒడ్డుగూడ వరకు 15 కిలోమీటర్ల మేర నూతన రోడ్లు నిర్మించనున్నారు. ప్రస్తుతం కల్వాడ నుంచి ఒడ్డుగూడకు వెళ్లే సింగిల్ రోడ్డు కాగా, పూర్తిగా గుంతలతో అధ్వానంగా మారింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డబుల్ రోడ్డు మంజూరు కావటంతో పెంచికల్‌పేట, దహెగాం, బెల్లంపల్లి మండలాల వాసులకు రవాణా సౌకర్యం మెరుగు పడనుంది. బాబాసాగర్ నుంచి గూడెం వరకు ఉన్న రోడ్డు వర్షాకాలంలో బురదమయంగా మారుతుంది. రోడ్డు నిర్మాణం జరిగితే బెజ్జూరు, కౌటాల, కాగజ్‌నగర్ మండలాలతో పాటు మహారాష్ట్రకు వెళ్లే వారికి తిప్పలు తప్పుతాయి. సిర్పూరు(టి)-మాకిడి అంతర్రాష్ట్ర రహదారి పూర్తిగా గుంతలతో ఉంది.

ఈ మార్గం గుండా మహారాష్ట్రలోని చంద్రాపూర్, రాజురా, బల్లార్షా పట్టణా లకు ప్రయాణం చేసేందుకు అవకాశం ఉంది. గుంతలతో గంటల కొద్ది ఆలస్యమవుతున్నట్టు ప్రయాణికులు పేర్కొంటున్నారు. వర్షాకాలం గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతోందో తెలియక ఇబ్బందులు పడాల్సి పరిస్థితి ఉంటుందని పలువురు డ్రైవర్లు తెలిపారు.

కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు నుంచి సిర్పూరు(టి) వరకు రోడ్డు వెడల్పు అవుతుండటంతో అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగజ్‌నగర్ ఎన్టీఆర్ చౌరస్తా వద్ద పెద్ద గుంతల ఏర్పడ్డాయి. గతంలో పలుమార్లు ఫిర్యాదులు చేయటంతో తాత్కాలిక మరమ్మతులను నాలుగు నెలల క్రితం చేపట్టారు. చిన్న పాటి వర్షానికే ఈ గుంతల్లో నీరు నిండటంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సమస్యలపై సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు అసెంబ్లీలో కూడా ప్రస్తావించారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లారు. ప్రస్తుతం నిధులు విడుదల కావటంతో పనులు త్వరగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

పనులు త్వరగా చేపట్టాలి..
పెద్దపల్లి కిషన్‌రావు, కాగజ్‌నగర్



రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం గా చేయాలి. ప్రస్తుతం ప్రధాన రోడ్డు పూర్తిగా గుంతలతో నిండి ఉన్నాయి. కాగజ్‌నగర్ నుంచి మాకోడి వరకు గుం తలతో నిండి ఉంది. ప్రయాణాలు చేయాలంటే కష్టంగా ఉంది. ఇక వర్షాకాలం పూర్తిగా గుంతల్లో వర్షం నీరు ఉం టుంది. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుద ల చేయటంతో పనులు త్వరగా చేపట్టాలి.

దశల వారీగా సమస్యలు పరిష్కారం..
డాక్టర్ హరీష్‌బాబు, సిర్పూరు ఎమ్మెల్యే



సిర్పూరు నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాను. నూతన రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాము. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.41 కోట్ల నిధులు విడుదలయ్యాయి. పనులు ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం. దశల వారీగా అన్ని సమస్యలను పరిష్కరిస్తాము.

యువకుడి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి



చుంచు వంశీ (ఫైల్)

దండేపల్లి నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం కన్నెపల్లి గ్రామానికి చెందిన చుంచు వంశీ (24) అనే యువకుడు తీవ్రమనస్తాపం చెంది ఈనెల 21న శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్‌ఐ తహసీనొద్దీన్, కుటుంబసభ్యులు తెలిపి న వివరాలు ఇలా ఉన్నాయి. వంశీకి ఈనెల 8న పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. వివాహం జరిగిన నాలుగు రోజులకే యువ తికి ఫిట్స్ వచ్చింది. ఈ విషయాన్ని వంశీ ఆమె తల్లిదండ్రులకు తెలి పాడు. తమ కూతురికి ఎటువంటి జబ్బు లేదని అల్లుడితో దబాయించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈనెల 21 శుక్రవారం రాత్రి సమయంలో గడ్డి మందు తాగాడు. ఈ విషయాన్ని సోదరుడు రాజుకి ఫోన్ ద్వారా తెలిపాడు. దీంతో కుటుంబసభ్యుల వెంటనే చికిత్స నిమిత్తం లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు వంశీ తల్లి చుంచు మంగ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తహసీనొద్దీన్ వెల్లడించారు.

బంగారం శుద్ధి పేరిట మోసం

కాగజ్‌నగర్, నవంబరు 24: కాగజ్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో సోమవారం ఉదయం బంగారం శుద్ధి చేస్తామని మాయమాటలు చెప్పి రెండు తులాలు అపహరించిన సంఘటన కాగజ్‌నగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఇండస్ట్రియల్ ఏరియాలో నివాసం ఉంటున్న సంధ్యశ్రీవాత్సవ ఇంటికి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చారు. బంగారం శుద్ధి చేస్తామని మాటల్లో పెట్టి కళ్ల ముందే డబ్బాలో రెండు తులాల బంగారాన్ని పెట్టినట్టు, పదిరోజుల వరకు డబ్బాను తెరవద్దని సూచించివెళ్లారు. పదినిమిషాల తర్వాత చూస్తే రెండు తులాల బంగారం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. సం ఘటన స్థలానికి పట్టణ సీఐ ప్రేంకుమార్ చేరుకొని వివరాలు సేకరించారు.

దుప్పట్లు, వాలీబాల్ కిట్ అందజేత



దుప్పట్లు, వాలీబాల్ కిట్‌ను పంపిణీ చేస్తున్న ఎస్పీ నితిక పంత్

కెరమెరి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని జోడేఘాట్ గ్రామపంచాయతీ పరిధిలోని కోలాంగూడ గ్రామంలో మీ కోసం కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు దుప్పట్లు, యువకులకు వాలీబాల్ కిట్‌లను ఎస్పీ నితిక పంత్ అందజేశారు. అనంతరం జోడేఘాట్‌లోని భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ సత్యనారాయణ, ఎస్సై మధుకర్ పాల్గొన్నారు.

గంజాయి సాగు కేసులో ఒకరికి ఐదేళ్లు జైలు

జైనూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జైనూర్ పోలీసుస్టేషన్ పరిధి లో గంజాయి సాగు కేసులో భోలే పాండురంగ్‌కు ఐదేళ్ల జైలు శిక్షతోపాటు 50 వేల రూపాయలు జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎంపీ రమేష్ తీర్పు వెలువరించినట్లు ఎస్పీ నితిక పంత్ ఒక ప్రకటనలో తెలిపారు. 2023లో జైనూర్ ఎస్సై సందీప్‌కుమార్‌కు భుసిమెట్ట గ్రామంలోని పత్తి పంటలో భోలే పాండురంగ్ అనే వ్యక్తి గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్టు సమాచారం అందింది. పత్తి పంటలో తనిఖీలు నిర్వహించగా 50 గంజాయి మొక్కలు లభించాయి. దీంతో ఎస్‌ఐ రాథోడ్ ఉమేష్ కేసు నమోదు చేశారు. రెండో సీఐ మల్లేష్, మూడవ సీఐ అంజయ్య విచారణ చేపట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్మోహన్‌రావ్, తమ వాదనలు వినిపించారు.

కారిడార్ రోడ్డును లింగాపూర్ మీదుగా వేయాలి

లింగాపూర్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన కారిడార్ రోడ్డును లింగాపూర్ మీగా వెళ్లే విధంగా చూడాలని లింగాపూర్ ప్రజలు, నాయకులు సోమవారం కోరారు. మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆరు నేషనల్ హైవే కారిడార్ రోడ్లు మంజూరు చేయడం శుభపరిణామమన్నారు. దీనిలో భాగంగా మహారాష్ట్ర నాగ్‌పూర్ హైవేకు అనుసంధానం కోసం జగిత్యాల మీదుగా జన్నారాం, కవ్వాల్, లింగాపూర్, పంగడి అసిఫాబాద్ మీదుగా నాగ్‌పూర్ నేషనల్ హైవే అనుసంధానానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. దీంతో మారుమూలు గిరిజన ప్రాంతాల్లోని మండలాలు, గ్రామాలకు నేషనల్ హైవే రోడ్డు సౌకార్యం కలుగుతుందన్నారు. ఆదీవాసీ ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వైద్యం, విద్య అందుబాటులో ఉంటుందని, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. కార్యాక్రమంలో మండల నాయకులు బలిరాం, మాజీ ఎంపీటీసీ రమేష్, కాంగ్రెస్ నాయకుడు శ్రీకాంత్, రవీందర్. వినోద్, ప్రకాశ్, బాదిపటేల్, సంతోష్, మిలింద్, సోరాజీ, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి చర్యలు
- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ, ఇతర కార్మికుల సంక్షేమంపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో కార్మికుల బీమా పెంపు, కార్మికుల సంక్షేమంపై కార్మిక శాఖాధికారులు, భవన నిర్మాణ కార్మిక సంఘాల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులు, ఇతర కార్మికుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక బీమాను సహజ మరణం పొందితే రూ.1.20 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పెంచిందని, ప్రమాదవ శాత్తు మరణం సంభవిస్తే ప్రమాద బీమాను రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచిందని వివరించారు. అంగవైకల్యం కలిగితే రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం కార్మిక సంక్షేమం కోసం అనేక చర్యలు చేపడుతోందన్నారు. ఈ నెల 24 నుంచి డిసెంబరు 3 వరకు అన్ని మండలాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. అనంతరం అవగాహన కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి హిమలత, తదితరులు పాల్గొన్నారు.



ఉత్పత్తి, నాణ్యతను సమన్వయపర్చుకోవాలి



శ్రీరాంపూర్ ఓసీపీని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

శ్రీరాంపూర్/జైపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు అవసరమైన ఉత్పత్తితోపాటు నాణ్యతను పాటించాలని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆయన శ్రీరాంపూర్ ఓసీపీని, శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే ఓసీపీ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం జీఎం కార్యాలయంలో భూగర్భ గనుల పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2025-26 ఆర్థిక సంవత్సరంలో ప్రతి గని సాధించాల్సిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు, సామర్థ్యాన్ని పెంచుకునేందుకు కృషి చేయాలన్నారు. అన్నివిభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, శ్రీరాంపూర్ ఓసీపీ పీవో వెంకటేశ్వర్లు, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, డీజీఎం(ఐఈడీ) రాజన్న, ఎస్టేట్స్ అధికారి మహేష్, సర్వే అధికారి సంపత్, ఇందారం ఓసీపీ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్టు ఇంజనీర్ రామకృష్ణరావు, గని మేనేజర్ శంకర్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో ఈడీ పర్యటన

రెబ్బెన, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి ఈడీ వెంకన్న, జీఎం విజయభాస్కర్‌రెడ్డితో కలిసి సోమవారం పర్యటించారు. ఉదయం జీఎం కార్యాలయంలో అన్ని విభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించారు. ఏరియా స్థితిగతులపై చర్చించారు. అనంతరం కైరిగూడ ఉపరితలగని వ్యూ పాయింట్ నుంచి గనిని పరిశీలించారు. బ్లాస్టింగ్ పనులు చేస్తున్న మహిళ ఉద్యోగులకు అభినందించారు. వట్టివాగు రక్షణ కట్టను పరిశీలించారు. అనంతరం గోలేటి సీహెచ్‌పీకి చేరుకుని మొక్కలు నాటారు. బొగ్గు డంపింగ్, దుమ్ము లేకుండా చేపడుతున్న చర్యలను వీక్షించారు. రైల్వే ట్రాక్, వాగన్ లోడింగ్ ప్రదేశాన్ని చూసి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీఓ నరేందర్, ఇంజనీర్ కృష్ణమూర్తి, ఎస్‌ఓటు జీఎం రాజమల్లు, వీరన్న, సీహెచ్‌పీ ఇన్‌చార్జి కోటయ్య, మేనేజర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం, హక్కుల కోసమే లేబర్ కోడ్స్

శ్రీరాంపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న కార్మికుల సంక్షేమం, హక్కులు, ఉద్యోగ భద్రత, వేతన నిర్మాణం, పారదర్శక ఉద్యోగ వ్యవస్థ బలోపేతం చేయడం లేబర్ కోడ్స్ లక్ష్యమని డీజీఎం ఎస్(మెకానికల్) దిలీప్ కుమార్, అంకిత్‌సింగ్ అన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీలో నాలుగు లేబర్ కోడ్స్‌పై నిర్వహించిన కార్మికుల అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా బీఎంఎస్ యూనియన్ మినహా, మిగతా యూనియన్లు కోడ్స్ అమలును వ్యతిరేకించాయి. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి చిప్ప వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్‌కుమార్ ఉన్నారు.

లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి





శ్రీరాంపూర్‌లో మాట్లాడుతున్న వీరభద్రయ్య, మందమర్రి జీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా డిమాండ్ చేశారు. ఏరియాలోని గనులు, విభాగాలపై ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నూతన లేబర్ కోడ్‌లతో కార్మికవర్గానికి తీవ్రనష్టం వాటిల్లుతుందన్నారు. కార్మికులు ప్రాణత్యాగం చేసి సంపాదించుకున్న ఎనిమిది గంటల పని దినాలను కోల్పోయి 12 గంటలు పనిచేయాల్సి వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం సంఘటిత, అసంఘటిత కార్మికులకు నష్టం చేసేవిధంగా, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసేవరకు అన్ని కార్మిక సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, నాయకులు బద్రి బుచ్చయ్య, సంపత్, ప్రసాద్‌రెడ్డి, పిట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ మందమర్రి ఏరియాలోని అన్ని గనుల, డిపార్టుమెంట్ల వద్ద గుర్తింపు సంఘం ఏఐటీయుసీ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏరియాలోని కేకే ఓసీ, ఏరియా స్టోర్, వర్కుషాపు, కేకే 5, గనుల వద్ద ధర్నా నిర్వహించారు. నాయకులు కంది శ్రీనివాస్, గాండ్ల సంపత్, శర్మ, ఓదెలు, కల్వాల శ్రీనివాస్; రాజేశం, ఎగ్గటి రాజేశ్వర్‌రావు, కన్నం వేణు, రాజశేఖర్, రాజుకుమార్‌యాదవ్, ప్రేంలాల్, చంద్రశేఖర్, సారయ్య, పాల్గొన్నారు.

- కార్మికుల హక్కులను కాల రాసేందుకు తీసుకొచ్చిన నాలుగు లేబ ర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాలని కోరుతూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జీఎం రాధాక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బ్రాంచి సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి బి. సుదర్శన్, నాయకులు దాగాం మల్లేశ్, ఇప్పకాయల లింగయ్య, సివి రమణ, తదితరులు పాల్గొన్నారు.

జైపూర్: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా పేర్కొన్నారు సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే 1ఏ, ఓసీపీపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. అనంతరం మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పిట్ కార్యదర్శి నవీన్‌రెడ్డి, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి ధరణి దేవేందర్, కాంట్రాక్టు రీజనల్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నవీన్, పద్మరాజు, శ్రీనివాస్, కేశవరావు, యూసఫ్, రాజగోపాల్, సతీష్‌లు పాల్గొన్నారు.

కాసిపేట: ఉద్యోగుల ప్రయోజనాలకు నష్టం కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన నాలుగు కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సోమవారం కాసిపేట 1, 2 గనులపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ ఎండీ అక్బర్ అలీ మాట్లాడుతూ నాలుగు కోడ్‌లను విరమించుకోకుంటే మంగళవారం అన్ని గనులు, డిపార్టుమెంట్ల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, నాయకులు కొండపల్లి నర్సయ్య, బొద్దున వెంకటేష్, కృష్ణచారి, రాజ్‌కుమార్, కాసిపేట 1వ గనిపై ఏఐటీ యూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, పిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మీనారాయణ, రాజేందర్ పాల్గొన్నారు.

బడాబాబుల ప్రయోజనానికే లేబర్ కోడ్‌లు

శ్రీరాంపూర్: బడా వ్యాపారవేత్తల ప్రయోజనం కోసమే కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చిందని జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీరాంపూర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొత్తగా అమల్లోకి వచ్చిన లేబర్ కోడ్‌లు కార్మికవర్గానికి శాపం వంటివని పేర్కొన్నారు. దీనివల్ల చట్టబద్ధంగా అమలయ్యే హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీ యూసీ, ఐఎఫ్‌టీయూ, ఎస్‌జీకేఎస్, టీఎస్‌యూఎస్, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు మణిరామ్‌సింగ్, చాంద్ పాషా, కృష్ణ, ఎ. మహేందర్, నీరటి రాజన్న, గోళ్ల అంజన్న, తదితరులు పాల్గొన్నారు.

రద్దు కోసం ఐక్య పోరాటాలు..

శ్రీరాంపూర్: లేబర్ కోడ్ల రద్దుకు ఐక్య పోరాటం చేయనున్నట్లు కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లేబర్ కోడ్ల అమలుతో కార్మికులు అనేక హక్కులు కోల్పోతారన్నారు. సమ్మెచేసే అవకాశం ఉండదని, చేయాలనుకుంటే ఆరు వారాల ముందుగా యాజమాన్యాలకు నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని ఇతర అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కె. రాజ్‌కుమార్, ఉప ప్రధానకార్యదర్శి కె వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, ఐఎన్‌టీయూసీ సీనియర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర నాయకుడు గరిగె స్వామి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేందర్‌రెడ్డి, నాయకుడు సత్తయ్య పాల్గొన్నారు.







జైపూర్‌లో గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కాసిపేటలో మాట్లాడుతున్న అక్బర్ అలీ, శ్రీరాంపూర్‌లో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

విశ్రాంత ఉద్యోగులకు అవగాహన

రెబ్బెన, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ కాంపెయిన్ 4.0 కార్యక్రమంలో భాగంగా విశ్రాంత సింగరేణి ఉద్యోగులకు సీఎంపీఎఫ్ రెన్యూవల్ చేసుకోడంపై గోలేటి జీఎం కార్యాలయంలో సోమవారం అవగాహన కల్పించారు. ఇకపై పెన్షన్, రెన్యూవల్ మీ సేవ కేంద్రాల్లో మాత్రమే కాకుండా సెల్‌ఫోన్ ద్వారా చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి తిరుపతి, డీజీఎం ఉజ్వల్ కుమార్ బెహెరా, సీఎంపీఎఫ్ అధికారులు శ్రీనివాస్, మనోహర్, హెచ్‌ఓడీ శ్రీనివాస్, ఏటీబీ ఇన్‌చార్జి ప్రశాంత్ పాల్గొన్నారు.

నూతన ఉద్యోగులను ఇతర ఏరియాలకు పంపవద్దు

శ్రీరాంపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నూతన ఉద్యోగులను ఇతర ఏరియాలకు పంపవద్దని హెచ్‌ఎంఎస్ సింగరేణి విభాగం అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు వి. అనిల్‌రెడ్డి, కార్యదర్శి పొనగంటి అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గతంలో బెల్లంపల్లి రీజియన్ వారికి రామగుండం రీజియన్‌లో పోస్టింగులు ఇవ్వడంతో ప్రయాణ భారం అధికమై గైర్హాజరు శాతం పెరిగిందన్నారు. ఇటీవల బెల్లంపల్లి రీజియన్ వారికి భూపాలపల్లిలో పోస్టింగులు ఇచ్చే ప్రయత్నంలో యాజమాన్యం ఉందన్నారు. దీనివల్ల నూతన ఉద్యోగులు పైరవీకారులను ఆశ్రయించి బదిలీల కోసం డబ్బులు వృథా చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దూరప్రాంతాలకు బదిలీ చేసే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సీఎండీ బలరాం స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

కార్పొరేట్ జీఎంకు సన్మానం

శ్రీరాంపూర్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ జీఎం(ఉపరితల గనులు)గా పనిచేస్తున్న డీవీఎస్ సూర్యనారాయణ రాజు ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందుతున్న సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం జీఎం కార్యాలయంలో సన్మానించారు. ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, ఇందారం, శ్రీరాంపూర్ ఓసీపీల పీవోలు ఏవీ రెడ్డి, సిహెచ్ వెంక టేశ్వర్లు, ఆర్‌కే 7 గ్రూప్ ఏజెంట్ రాజేందర్, డీజీఎంలు అనిల్‌కుమార్, రాజన్న, రవీందర్, ఎస్‌ఈ పర్చేజ్ చంద్రశేఖర్, పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బెల్లంపల్లి, : పీడీఎస్‌యూ జిల్లా 20వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. ఈ నెల 26, 27 జిల్లా మహా సభలను మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని నాయకులు అన్ని వర్గాల ప్రజలు హాజరుకా వాలన్నారు. నాయకులు రాజు, ప్రవీణ్, అంజన్న, సాయి, నవీన్, శశి కుమార్‌లు పాల్గొన్నారు.

మంచిర్యాల క్రైం : మంచిర్యాల పట్టణం అండాలమ్మ కాలనీకి చెందిన దారంగుల రాజు, శివలపై కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు. అండాలమ్మ కాలనీకి చెందిన లక్ష్మీ భర్త సాయిలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


చెన్నూరు : క్రెడిట్ ఆక్సిస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెన్నూరు పోలీస్ స్టేషన్‌కు 10 ఐరన్ బారీ కేడ్లను పోలీసులకు అందజేశారు. ఫౌండేషన్ డివిజనల్ మేనేజర్ చంద్రశేఖర్, షేక్ అరివుల్లా మాట్లాడుతూ తమ కంపెనీ 18 రాష్ట్రాల్లో విస్తరించి 2061 బ్రాంచీల పరిధిలో సామాజి కసేవా కార్యక్రమాలను చేస్తున్నామన్నారు. లైజనింగ్ ఏరియా మేనేజర్ నరసింహారావు, నాగరాజు, పోలీసులు పాల్గొన్నారు.


మంచిర్యాల కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌లోని కాళిమాత ఆలయంలో సోమవారం చండీయాగాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వహకులు నల్ల శంకర్, డీఎస్పీ రఘునాథ్ చౌహాన్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరుపతి, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఊత్కూర్‌కు చెందిన శంకర్ అనే రైతు కుటుంబానికి రూ.2లక్షల బీమా చెక్కును మృతుని కుటుంబీకులకు సొసైటీ చైర్మన్ తిప్పని లింగయ్య అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మేనేజర్ నరేష్, సీఈవో విష్ణువర్ధన్‌రావు ఉన్నారు.

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి, కేతనపల్ల, దస్నాపూర్, వేమనపల్లి గ్రామాల్లో సోమవారం మండల కాంగ్రెస్ నాయకులు డీసీఎంఎస్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

కబళిస్తున్న క్యాన్సర్





● జిల్లాలో పెరుగుతున్న కేసులు ● బాధితులకు మెరుగైన వైద్యం అందేనా..?

కారణాలు ఎన్నో..?

జిల్లాలో ప్రధానంగా క్యాన్సర్ బాధితులు పెరగడానికి కాలుష్యంతో పాటు పురుగుల మందులు, ఎరువులతో కూడిన ఆహారాన్ని తినడంతోనే క్యాన్సర్ భారినపడుతు న్నారు. పలు ప్రాంతాల్లో నిరక్ష్యరాస్యత కారణంగా ఆరోగ్య విషయాలపై అవగాహన లేకపోవడం వంటివి కూడ ప్రధాన కారణంగా తెలుస్తోంది. దీంతో పాటు జన్యుపరమైన సమస్యతో కూడ క్యాన్సర్ భారిన పడు తున్నారు. పురుషుల్లో మద్యం, పొగాకు అలవాట్లతో క్యా న్సర్ భారిన పడుతున్న సంఘటనలు చోటు చేసుకుం టున్నాయి. ఎక్కువగా మగవారిలో ఊపిరితిత్తులు, ప్రొ స్టేట్, కొలేస్ట్రాల్, కడుపు, లివర్ క్యాన్సర్‌లు ఎక్కువగా వస్తున్నాయి. మహిళల్లో బ్రెస్ట్, గర్భాశయ, ఊపిరితిత్తు లు, థైరాయిడ్ క్యాన్సర్లు వస్తున్నాయి. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించి మంచి వైద్యం అంది ధైర్యంగా ఎదుర్కొంటే క్యాన్సర్ వ్యాధి నుంచి బయట పడొచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. అదే విధంగా పెరుగుతు న్న క్యాన్సర్ బాధితులకు అనుగుణంగా జిల్లా కేంద్రంలోని క్యాన్సర్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు నియోజ కవర్గ కేంద్రాలైన బెల్లంపల్లి, చెన్నూర్‌లో సైతం క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బెల్లంపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అత్యంత ప్రమాదకరమైన వ్యాధి క్యాన్సర్ కేసులు జిల్లాలో రోజు రోజుకూ పెరుగుతున్నాయి. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా క్యాన్సర్ భారినపడుతున్నారు. సరైన దశలో వ్యాధిని గుర్తించక మృత్యువాత పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. జిల్లాలో నోటి, ఊపిరితిత్తులు, లివర్, పేగు క్యాన్సర్లు పురుషుల్లో వెలుగు చూస్తుండగా, మహిళల్లో బ్రెస్ట్, గర్భాశయ ముఖద్వారా, నో టి క్యాన్సర్లు అధికంగా వస్తున్నాయి. జిల్లా వైద్య ఆరో గ్యశాఖ పరిధిలో ఎన్‌సీడీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టు నిర్వహిస్తున్నారు. క్యాన్సర్ బారిన పడినవారికి జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో క్యాన్స ర్‌వార్డు కేటాయించి నప్పటికీ పూర్తి స్థాయిలో ఆధునిక పరికరాలతో పాటు వైద్య సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి...

జిల్లాలో ప్రతి ఏడాది కొత్తగా పదుల సంఖ్యలో క్యాన్సర్ కేసులు వెలుగు చూస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఎన్‌సీడీ ఆధ్వర్యంలో క్యాన్సర్‌కు సంబంధించిన స్క్రీ నింగ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ప్రతి మండల కేం ద్రంలోని పీహెచ్‌సీల వద్ద ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వ హిస్తున్నారు. సేకరించిన నమూనాలను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి పరీక్షల నిమిత్తం పంపిస్తున్నారు. ఆలనా అనే ప్రత్యేక అంబులెన్స్ ద్వారా వైద్య సిబ్బంది ఆయా మండలాల్లోని పీహెచ్‌సీ వద్ద ప్రతి రోజు మహిళలకు, పురుషులకు, వృద్ధులకు స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించి క్యాన్సర్ నిర్ధారణ చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం మొత్తం 168 మంది క్యాన్సర్ భారిన పడ్డ వారు ఉన్నారు. ఇందులో బ్రెస్ట్ క్యాన్సర్ బాధితులు 48 మంది, సర్వికల్ క్యాన్సర్ బాధితులు 36, ఓరల్ క్యాన్సర్ బాధి తులు 24, ఇతర రకాల క్యాన్సర్ బాధితులు 60 మంది ఉన్నారు. ప్రతి ఏటా క్యాన్సర్ బాధితుల సంఖ్య జిల్లాలో పెరుగుతుంది.

ప్రతియేటా పెరుగుతున్న కేసులు..?

జిల్లా వ్యాప్తంగా ప్రతి ఏటా పెరుగుతున్న క్యాన్సర్ బాధితులకు మెరుగైన వైద్యం అందేలా ఉన్నతాధికారులతో పాటు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బాధితులు, వారి కుటుంబ సభ్యుల పేర్కొంటున్నారు. జిల్లా కేంద్రంలోని మాతా శివు ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో వ్యాధి సోకిన బాధితులకు వైద్యం అందించేందుకు పూర్తి స్థాయిలో పరికరాలతో పాటు వైద్యులు లేరు. క్యాన్సర్ సెంటర్‌లో కీమోథెరపీ అందుబాటులోకి తీసుకొచ్చినప్పటికీ రేడియోథెరపీ అందు బాటులో లేకపోవడంతో క్యాన్సర్ బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే క్యాన్సర్ సెంటర్‌లో మెడికల్, అంకాలజీ, సర్జికల్ అంకాలజిస్టులు అందుబాటులో లేకపోవడంతో క్యాన్సర్ బాధితులు హైదరాబాద్, కరీంనగర్ వంటి పట్టణాలకు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన దు స్థితి ఏర్పడుతుంది. పూర్తి స్థాయిలో ఆధునిక పరికరా లతో పాటు వైద్యులను ఏర్పాటు చేస్తే క్యాన్సర్ బాధితులకు మెరుగైన వైద్యంతో పాటు ఉపశమనం కలుగనుంది.

స్క్రీనింగ్ చేస్తున్నాం..

డాక్టర్. ఎ. ప్రసాద్, ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్



జిల్లా వ్యాప్తంగా క్యాన్సర్‌కు సంబంధించిన స్క్రీనింగ్‌ను చేస్తున్నాం. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా అరికట్టవచ్చు. వయస్సుతో సంబంధం లేకుండా పలువురు క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఆరోగ్యం పై పూర్తి అవగాహన ఉండాలి. తరుచు జ్వరం, రక్త స్రావం, విపరీతమైన అలసట, దగ్గుమానకుండా రావడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయ కుండా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించుకోవాలి. క్యాన్సర్ సెంటర్‌లో క్యాన్సర్ రోగులకు అన్ని రకాల సేవలు అందిస్తున్నాం.

ఎస్టీపీపీని సందర్శించిన సెక్యూరిటీ జీఎం



సెక్యూరిటీ జీఎంను సన్మానిస్తున్న ఎస్టీపీపీ అధికారులు

జైపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీపీపీని సింగరేణి సెక్యూరిటీ జీఎం లక్ష్మీనారాయణ సోమవారం సందర్శించారు. ఆయనకు జీఎం మదన్ మోహన్ స్వాగతం పలికారు. సెక్యూరిటీ జీఎం ఎస్టీపీపీలో ఉన్న సెక్యూరిటీ విభాగాన్ని తనిఖీ చేశారు. మూడవ యూనిట్ నిర్మాణ ప్రాంతం, మిథనాల్ ప్లాంటు, ఏరియా స్టోర్‌ను తనిఖీ చేశారు. మూడవ యూనిట్ పనులు జరుగుతున్నందున ప్లాంటుకు వెళ్లే దారిని మళ్లించి ప్లాంటు మెటీరియల్ గేటు పక్కన కార్మికుల కోసం మరో గేటును ఏర్పాటు చేయడాన్ని ఆయన పరిశీలించారు. అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌లో నిఘా పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ నెల 30న పదవీ విరమణ పొందుతున్న లక్ష్మీనారాయణను అధికారులు సన్మానించారు. అధికారులు కిరణ్‌బాబు, జనగామ శ్రీనివాస్, వెంకటయ్య పాల్గొన్నారు.

సోమగూడెం స్కూల్‌లో కొనసాగుతున్న నిరసనలు

ఇళ్లకే పరిమితమైన విద్యార్థులు

కాసిపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సోమగూడెం ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల నిరసనలు కొనసాగుతున్నాయి. సోమగూడెం పాఠశాల నుంచి ప్రవళిక అనే ఉపాధ్యాయురాలును డిప్యూటేషన్‌పై పంపడాన్ని నిరసిస్తూ వారం రోజులుగా పిల్లలను బడికి పంపించకుండా తల్లిదండ్రులు నిరసనలు చేస్తున్నారు. 47 మంది విద్యార్థులున్న సోమగూడెం పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా ఇటీవల ఒక ఉపాధ్యాయురాలును కాసిపేట ఎంపీపీ పాఠశాలలకు డిప్యూటేషన్‌పై పంపించారు. ఐదు తరగతులు ఉన్న పాఠశాలలో ఇద్దరే ఉపాధ్యాయులు ఉండడంతో నాణ్యమైన విద్య అందదని నిరసనకు దిగారు. డిప్యూటేషన్ రద్దు చేసి ఉపాధ్యాయురాలును ఇక్కడే ఉంచాలని సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చినట్లు పేరెంట్స్ కమిటీ సభ్యులు తెలిపారు.

దండేపల్లి మండల సర్పంచుల రిజర్వేషన్లు ఖరారు

దండేపల్లి నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండల సర్పంచుల రిజర్వేషన్లను అధికారికంగా ఖరారైనట్లు ఎంపీడీవో ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దండేపల్లి మండలం లోని 31 గ్రామ పంచాయతీలోని సర్పంచులు స్థానలలో రిజర్వేషన్ ఈవిధంగా ఉన్నాయి. మండలంలోని 31 జీపీలలో సర్పంచు స్థానాల రిజర్వేషన్ ఈ విధంగా కొత్తమామిడిపల్లికి (ఎస్టీ జనరల్), చెల్కగూడకు (ఎస్టీ మహిళ), గూడెంకు (ఎస్టీ జనరల్), కోర్విచెల్మ (ఎస్టీ మహిళ), ముత్యంపేటకు (ఎస్టీజనరల్), రాజుగూడకు (ఎస్టీ మహిళ), దండేపల్లికి (ఎస్టీ జనరల్), కర్ణపేటకు (ఎస్టీ జనరల్), నెల్కివెంకటాపూర్‌కు (ఎస్టీ మహిళ), తాళ్లపేటకు (ఎస్టీ జనరల్), వందూర్‌గూడకు (ఎస్టీ మహిళ), లింగాపూర్‌కు (ఎస్సీమహిళ), గుడిరేవుకు (ఎస్సీ మహిళ), నర్సాపూర్‌కు (ఎస్సీ జనరల్), ద్వారకకు (ఎస్సీ జనరల్), నాగసముద్రంకు (ఎస్సీ జనరల్),ఆల్లీపూర్‌కు (బీసీ మహిళ), కాసిపేటకు (బీసీ మహిళ), లక్ష్మీకాంతపూర్‌కు (బీసీ జనరల్), రెబ్బనపల్లికి (బీసీ జనరల్), కొండాపూర్‌కు (యు.ఆర్ మహిళ), మేదరిపేటకు (యు.ఆర్ మహిళ), మామిడిపల్లికి(యు.ఆర్ మహిళ), ధర్మరావుపేటకు (యుఆర్ జనరల్), మాకుల పేటకి(యు.ఆర్‌జనరల్), వెల్గనూర్‌కు (యు.ఆర్ మహిళ), కన్నెపల్లికి (యు.ఆర్‌జనరల్),తానిమడుగు(యు.ఆర్ మహిళ), చింతపల్లికి (యు.ఆర్ జనరల్), నంబాలకి (యు.ఆర్ జనరల్), పెద్దపేటకి (అన్ రిజర్వుడు జనరల్)లకు రిజర్వేషన్‌లను కేటాయించారు.

కలెక్టర్‌కు సన్మానం

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ చాంబర్‌లో సోమవారం కలెక్టర్ కుమార్ దీపక్‌ను డీఆర్‌డీవో కిషన్, మహిళ సంఘాల సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పురస్కారాల్లో మంచిర్యాల జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మద్దతు ధర కోసం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

నెన్నెల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రైతులు అహర్నిషలు కష్టపడి పండించే పంటలకు మద్దతు ధర కల్పించేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని సెర్ప్ ఏపీఎం త్రయంబకేశ్వ ర్ అన్నారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మండలంలోని చిన్నవెంకటాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ హరీష్ గౌడ్, గ్రామైక్య సంఘం అ ధ్యక్షురాలు రాజేశ్వరి, నాయకులు పాల్గొన్నారు.

వేమనపల్లిలో సామూహిక గీతాలాపన

వేమనపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ గేయం వందేమాతరం 150 ఏళ్ల పూర్తి చేసిన సందర్భంగా సామూహిక గీతాలాపన చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల సంరక్షణ ప్రభారి రాపర్తి వెంకటేశ్వర్లు పాల్గొని బీజేపీ నాయకులతో వందేమాతర గీతాలపన చేశారు.

రిజర్వేషన్‌ల గెజిట్ నోటిఫికేషన్ విడుదల

కాసిపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రెండవ సాధారణ సర్పంచు, వార్డు మెంబర్ల ఎన్నికల్లో భాగంగా సోమవారం కాసిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సత్యనారాయణసింగ్ రిజర్వేషన్‌ల గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విడుదల చేసినట్లు తెలిపారు. ఎంపీవో సప్దర్ ఆలీ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల ప్రక్రియ షురూ...

(5వ పేజీ తరువాయి)

మొత్తంగా 2680 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రి జిల్లాకు ఇప్పటికే చేరింది. అలాగే ఎన్నికల సిబ్బంది నియామక ప్రక్రియ కూడా దాదాపు గా పూర్తికాగా, వారికి శిక్షణ కార్యక్రమం కూడా ముగిసింది.

పోటీకి సిద్ధపడుతున్న ఆశావహులు...

రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి అయినందున త్వరలోనే ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసే అవకాశాలు ఉండటంతో గ్రామాల్లో ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కాయి. రిజర్వేషన్లు అనుకూలిస్తే రంగంలోకి దిగాలని భావిస్తున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఆశావహులు రిజ ర్వేషన్లు అనుకూలించిన చోట ఆ మేరకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పంచాయతీ ఎన్నికల్లో టికెట్ సాధించాలనే పట్టుదలతో ఉన్న ఆశావహులు ఆ మేరకు తమ ప్రయత్నాల్లో ఉన్నారు. ముఖ్యంగా సర్పంచ్ స్థానాలకు ఈసారి యువత రంగంలోకి దిగే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పార్టీ పరంగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నప్పటికీ మొత్తంగా 50 శాతం రిజర్వేషన్లు పెంచరాదన్న నిబంధనలతో పాత పద్ధతిలోనే వివిధ వర్గాల జనాభా దామాషా ఆధారంగా సీట్లు కేటాయించారు. ఒకవేళ రిజర్వేషన్ అనుకూలించిన పక్షంలో ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలనే కుతూహలంతో బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకులకు ఆశని పాతమే ఎదురైంది. దీంతో అన్ రిజర్వ్ కేటగిరీలో బరిలోకి దిగడం ద్వారా తమ అదృ ష్టాన్ని పరీక్షించుకోవాలనే కుతూహలంతో ఉన్నారు. సర్పంచ్ పదవుల బరిలో నిలవాలనే ఔత్సాహికులు టికెట్ కోసం ఆయా నియోజక వర్గాల ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకులతో మంతనాలు జరుపుతున్నారు. గత ఎన్నికల్లోనూ బీసీలు పై చేయి సాధించిన దాఖలాలు అనేకం ఉన్నాయి. జనరల్ స్థానాల్లోనూ తమ ప్రతిభను కనబరిచి అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వివిధ మండలాల నుంచి పెద్ద మొత్తంలో వెనుక బడ్డ కులస్థులు టికెట్ రేసులో ఉండే అవకాశాలు ఉన్నాయి.

పంచాయతీ ఎన్నికల్లో గెలుపు అధికార పార్టీకి తప్పనిసరి కావడంతో కాంగ్రెస్‌తో పాటు బీజేపీ, బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు గెలుపు గుర్రాలకే టికెట్లు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

డీసీసీ అధ్యక్షుడికి సన్మానం



రఘునాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మందమర్రి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకమైన పిన్నింటి రఘునాథ్‌రెడ్డిని సోమవారం మండల కాంగ్రెస్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకు లు బానోత్ నీలయ్య, కడారి జీవన్‌కుమార్, మాసు సంతోష్, తిరుపతి, ఆకుల అంజి, వేల్పుల శంకర్, చిరంజీవి, రేగుంట రాజయ్య, భాస్కర్, కార్తీక్‌శ్రీను, పున్నం పాల్గొన్నారు.

బీసీ నాయకుల ధర్నా

భీమారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో ఏ ఒక్క గ్రామపంచాయతీలో కూడా బీసీలకు రిజర్వేషన్ కల్పించలేదని పేర్కొంటూ బీసీ సంఘం నాయకులు సోమవారం ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఎందుకు బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించలేదని ఎంపీడీవో మధుసూదన్‌ను గెరావ్‌చేశారు. రిజర్వేషన్ ప్రక్రియ తమ పరిధిలో లేదని ఉన్నతాధికారుల నుంచి వచ్చిన జాబితాను ప్రదర్శించామని ఎంపీడీవో చెప్పారు. రిజర్వేషన్ ప్రక్రియ కలెక్టరేట్‌లో ఉంటుందని ఎంపీడీవో నాయకులకు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ మండలంలో 11 గ్రామపంచాయతీలు ఉండగా భీమారానికి అన్ రిజర్వుడు మహిళ, దాంపూర్‌కు జనరల్, ఎల్కేశ్వరంలో జనరల్ మహిళ, మద్దికల్ జనరల్, కొత్తపల్లి జనరల్, పోలంపల్లి అన్ రిజర్వుడ్ మహిళ, బూరుగుపల్లికి ఎస్టీ జనరల్, నర్సింగాపూర్‌కు ఎస్టీ మహిళకు కేటయించారని తెలిపారు. ఆరేపల్లికి ఎస్సీ జనరల్, ధర్మారానికి ఎస్సీ జనరల్, కాజీపల్లికి ఎస్సీ మహిళను కేటాయించారని తెలిపారు. ఎస్‌ఐ శ్వేత సంఘటన స్థలానికి చేరుకుని బీసీ నాయకులను సముదాయించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, చందు, శ్రీకాంత్, శ్రీనివాస్, నరహరి, కిరణ్‌బాబు పాల్గొన్నారు.

బీసీలకు సర్పంచు సీట్లు కేటాయించండి



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

కాసిపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ప్రకటించిన సర్పంచుల రిజర్వేషన్‌లలో బీసీలకు సర్పంచు సీట్లు కేటాయించాలని కోరుతూ సోమవారం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌కుమార్‌కు బీసీ సంఘాల నాయకులు వినతి పత్రాలు అందించారు. ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని చెప్పి ఇప్పుడు నియోజకవర్గంలో బీసీలకు మొండి చేయి చూపిందన్నారు. నెన్నెల, కాసిపేట మండలాల్లో ఒక్క బీసీ సీటు కూడా కేటాయించకపోవడంతో బాధకరమన్నారు. మాజీ సర్పంచు చందు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ క్రిష్ణకు బీసీ సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రకటించిన రిజర్వేషన్లతో బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. బీసీలకు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ఏడు స్థానాలకు బీసీలకు అవకాశం దక్కుతుందని పేర్కొన్నారు. పాత పద్దతిలో రిజర్వేషన్లు కల్పిస్తే నాలుగు స్థానాలు బీసీలకు రిజర్వేషన్లు వస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రకటించిన సర్పంచ్ బీసీ రిజర్వేషన్‌లతో తీరని అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. నాయకులు తిరుపతి, గణేష్, రమేశ్, బాపులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

మంచిర్యాల క్రైం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణం ఎల్ఐసీ కాలనీకి చెందిన మిట్టపల్లి ప్రియాంక అత్తమామ, మరిది వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి మండలం సారంగపూర్‌కు చెందిన ప్రవీణ్ కుమార్‌తో 2014లో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు రాంలక్ష్మణ్ ఉన్నారు. కొంత కాలంగా అత్త, మామ రమాదేవి సత్యనారాయణ, మరిది ప్రదీప్‌లు ప్రియాంకతో చీటికిమాటికి గొడవ పడేవారు. వారి వేధింపులు భరించలేక తల్లిగారి ఇంటికి ఈ నెల 9న వచ్చింది. అయినప్పటికి వే. దింపులు ఆగకపోవడంతో సోమవారం ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీసీ రిజర్వేషన్‌ను స్థానిక ఎన్నికల్లో అమలు చేయాలి

మంచిర్యాల క్రైం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్‌లను అమలు చేయాలని, స్థానిక ఎన్నికలకు ఇచ్చిన జీవోను వ్యతిరేకంగా జీవో ప్రతిని దహనం చేశారు. బీసీ మహిళా జేఏసీ కన్వీనర్ పేరం అలేఖ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వేషన్‌కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదన్నారు. జీవో 46 జారీ చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ ప్రజలను రాజకీయంగా అణగదొక్కడానికి బీసీలకు తీరని అన్యాయం చేసిందన్నారు. నాయకులు మనోహర్, మధుసూదన్, శ్రీనివాస్, పూరేళ్ల సతీష్, నితీష్ పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

మందమర్రిరూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి మండలంలోని సారంగపల్లి -చిర్రకుంట గ్రామాల మధ్య రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలను, ముళ్లపొదలను సోమవారం పట్టణ ఎస్ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో తొలగించారు. రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. అందుకే ప్రమాదాలు జరగకుండా వీటిని తొలగించామన్నారు.

మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యం



మహిళా సంఘ సభ్యులకు చీరలు అందిస్తున్న ఎమ్మెల్యే వినోద్,అధికారులు

బెల్లంపల్లి, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తుందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరా మహిళాశక్తి చీరలు, మహిళ స్వయం సహాయక సంఘాలకు రుణాలను అందజేసి మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల్లో 18ఏళ్ల నిండినవారందరికీ ప్రభుత్వం చీరలు పంపిణీ చేస్తోందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ప్రతి సంక్షేమ పథకంలో మహిళలకు ప్రాధాన్యం ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. అనంతరం మహిళ స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా 30 సంఘాలకు రూ.5కోట్ల రుణాల పంపిణీ చెక్కును అందజేశారు. ఎంపీడీవో మహేందర్, తహసీల్దార్ క్రిష్ణ, నాయకులు నాతారి స్వామి, కారుకూరి రాంచందర్ పాల్గొన్నారు.

తాండూర్ : మహిళల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ మహిళ శక్తి చీరలను మహిళలకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. అనంతరం తాండూర్ మండల కేంద్రంలో పూర్తయిన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే హాజరై ఇంటిని ప్రారంభించారు. తహసీల్దార్, ఎంపీడీవో, వీవోఏలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హాజీపూర్ : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్ పాండే, ఎంపీడీవో సాయి వెంకట కృష్ణ రెడ్డిలు స్థానిక నాయకులతో కలిసి స్వయం సహాయక సంఘాల మహిళలకు సోమవారం చీరలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా సంక్షేమ పథకాల్లో భాగంగా హాజీపూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో ఇందిర మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ అర్హులైన మహిళలందరికీ ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేస్తామని అన్నారు ప్రభుత్వం మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. మండలంలోని ప్రజలకు పింఛన్‌లతో పాటు ఏ ఇతర సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే ఆ సమస్యలను ఎమ్మెల్యే, కలెక్టర్‌ల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. హాజీపూర్ మండలంలో మొదటి విడతగా 6వేల చీరలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మిగతా చీరలను రెండో విడతలో అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘం అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని ధర్మారావుపేట లంబాడితండా(డీ), కాసిపేట, ముత్యంపల్లి, మల్కేపల్లి, రొట్టెపల్లి, దేవాపూర్‌లో సోమవారం ఇందిర మహిళ శక్తి చీరలను కాంగ్రెస్ నాయకులు మహిళలకు చీరలను పంపిణీ చేశారు. నాయకులు, మహిళలు, వీవోఏలు, సీసీలు పాల్గొన్నారు.

ఎంఈవో బాధ్యతల స్వీకరణ

మందమర్రిరూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల నూతన ఎంఈవోగా రాథోడ్ రమేష్ సోమవారం మండల విద్యా వనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. సిబ్బందికి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన ఎంఈవో దత్తమూర్తికి వీడ్కోలు పలికారు.

హెడ్‌కుక్ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

మందమర్రిరూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో హెడ్ కుక్ పోస్టుకోసం మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో రాథోడ్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాసై 45 సంవత్సరాల వయస్సులోపు ఉండాలన్నారు. ఈ నెల 29లోగా దరఖాస్తులను ఎంఈవో కార్యాలయంలో అందించాలని సూచించారు.

కిసాన్ కపాస్ యాప్‌తో సమస్యలు

మందమర్రిరూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కిసాన్ కపాస్ యాప్‌తో సమస్యలు ఎదుర్కొంటున్నామని పత్తి రోజులు సోమవారం సండ్రోన్‌పల్లిలోని రైతు వేదికలో ఏఈవో ముత్యం తిరుపతికి వినతి పత్రం అందించారు. రైతులు ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.


కబళిస్తున్న క్యాన్సర్
- జిల్లాలో పెరుగుతున్న కేసులు
- బాధితులకు మెరుగైన వైద్యం అందేనా..?
7

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం
- బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్
7

బీసీలకు సర్పంచ్ సీట్లు కేటాయించాలి
బెల్లంపల్లి సబ్ కలెక్టర్‌కు బీసీ సంఘం నాయకుల వినతి
7

ఎస్టీపీపీని సందర్శించిన సెక్యూరిటీ జీఎం
పలు విభాగాలు తనిఖీ
7

బీసీ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోండి

హాజీపూర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 9, 10 తరగతి బీసీ విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవాలని వసతి గృహ సంక్షేమాధికారి హాజీపూర్ మండల ఇన్‌చార్జి మోసిన్ అహ్మద్ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ అకౌంట్ కలిగి ఉండాలని తెలిపారు. వీటిని ప్రభుత్వ వెబ్‌సైట్ ఈపాస్‌లో అప్లై చేసుకోవాలని, వీరికి ప్రతి సంవత్సరం 4 వేల చొప్పున ప్రభుత్వం స్కాలర్‌షిప్‌గా అందజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశం, ఉపాధ్యాయులు రవీందర్ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంచిర్యాల, జైపూర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరించేలా సంబంధిత అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య, ఆర్డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలకు వడ్డీ లేని రుణాల పంపిణీ ద్వారా ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నామని రాష్ట్ర ఉపముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమంలో భాగంగా ఇందిర మహిళ శక్తి చీరలను పంపిణీ చేస్తున్నామని, చీరల నాణ్యత బాగుందనిమహిళల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు.

మహిళల అభివృద్ధికి మరో అడుగు ముందుకు వేసి వడ్డీ లేని రుణాలు మహిళలకు పెద్ద ఎత్తున అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 25న రాష్ట్ర వ్యాప్తంగా మరొక విడత పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో మహిళ సమాఖ్యలను భాగస్వామ్యం చేస్తూ నిధుల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దీపక్, డీఆర్‌డీవో కిషన్ పాల్గొన్నారు.

రిజర్వేషన్‌ల ప్రక్రియ పునః పరిశీలన

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలు 2025 సందర్భంగా బీసీ డెడికేషన్ కమిషన్ నివేదిక ఆధారంగా జిల్లాలోని సర్పంచు, వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్‌ల ప్రక్రియ పునఃపరిశీలన చేయనున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 306 గ్రామపంచాయతీలు, 2,680 వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వే షన్‌ల ప్రక్రియ పునఃపరిశీలన చేస్తామన్నారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ఘురూ

- సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు
- గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన కలెక్టర్
- త్వరలో ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- గ్రామాల్లో నెలకొన్న ఎన్నికల సందడి

సర్పంచ్ రిజర్వేషన్లు మండలాల వారీగా...

మండలం	జీపీల సంఖ్య	ఎస్సీ	ఎస్టీ	బీసీ	జనరల్
బెల్లంపల్లి	17	06	01	02	08
భీమారం	11	03	02	00	06
భీమిని	12	01	03	02	06
చెన్నూరు	30	11	02	02	15
దండేపల్లి	31	14	02	04	11
హాజీపూర్	12	07	00	01	04
జైపూర్	20	08	01	01	10
జన్నారం	29	09	06	02	12
కన్నెపల్లి	15	04	01	02	08
కాసిపేట	22	15	02	00	04
కోటపల్లి	31	12	03	00	16
లక్షెట్టిపేట	18	06	00	04	08
మందమర్రి	10	03	02	00	05
నెన్నెల	19	06	03	00	10
తాండూరు	15	05	01	02	07
వేమనపల్లి	14	04	02	01	07

మంచిర్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధికారులు రిజర్వేషన్లు ప్రకటించడంతో ఎట్టకేలకు పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం అధికారులు ఆమే రకు డ్రా పద్ధతిలో రిజర్వేషన్ల ప్రక్రి య పూర్తి చేయగా, కలెక్టర్ కుమార్ దీపక్ తుది గెజిట్ నోటిఫికేషను విడు దల చేశారు. పంచాయతీ ఎన్నికల్లో ఎస్సీ, ఎటీకు 2011 జనాభా లెక్కల ప్రకారం, బీసీలకు గత ఏడాది నిర్వహించిన సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, సమగ్ర కుల గణన ఆధారంగా రిజ ర్వేషన్లు కేటాయించారు. జిల్లాలో మొత్తం 306 సర్పంచ్ స్థానాలు ఉండగా, వాటి పరిధిలోగల 2680 వార్డులకు ఎన్నికలు నిర్వహించవలసి ఉంది. సర్పంచ్ స్థానాల్లో బీసీలకు 23, ఎస్సీలకు 117, ఎస్టీలకు 29, జనరల్‌కు 137 స్థానాలను కేటాయించారు. అలాగే వార్డు సభ్యుల్లో స్థానాల్లో ఎస్సీలకు 803, ఎస్టీలకు 253, బీసీలకు 334, జనరల్ కేటగిరీకి 1290 స్థానాలకు కేటాయించారు.

జిల్లాలో 3.7 లక్షల ఓటర్లు...

పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో తుది ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని 306 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 3,76,669 ఓటర్లు ఉన్నారు. వీరిలో స్త్రీలు 1,91,011 మంది ఉండగా, పురుషులు 1,85,643, ఇతరులు 15 మంది ఉన్నారు.

ఏర్పాట్లు పూర్తి..

పంచాయతీ ఎన్నిలకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు దాదాపుగా ఇప్పటికే పూర్తి చేశారు. ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో జిల్లాలోని 306 గ్రామ పంచాయతీలలో వార్డుకు ఒక పోలింగ్ బూత్ చొప్పున ర్పాటు చేయనున్నారు. జిల్లాలోని మొత్తం 306 గ్రామ పంచా యతీల పరిధిలో 2680 వార్డులు ఉన్నాయి. ఒక్కో వా ర్డుకు ఒకటి చొప్పున.

(తరువాయి 7లో)

విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న జీవీఆరెక్స్

మందమర్రిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని కార్మెల్ అకాడమి డైరెక్టర్, ఫాదర్ డాక్టర్ జీవీఆరెక్స్ తెలిపారు. సోమవారం పట్టణంలోని కార్మెల్ పాఠశాలలో ఇంటర్ స్టేట్ క్రీడల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల నుంచి వచ్చిన టువంటి క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ పోటీలు ప్రదానంగా 8, 9, 10వ తరగతి విద్యార్థులకు సంబంధించినవని తెలిపారు. ఈ పోటిల్లో వాలీబాల్, ఖోఖో, బాస్కెట్‌బాల్, డ్రాయింగ్, డ్యాన్స్ పోటీలు ఉంటాయని, అంతేగాకుండా పోయెట్రీ ఉపన్యాసం పోటీలు కూడ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు గెలు పోటములు ఒకే విధంగా తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థులు వారు ఎంచుకున్న క్రీడలపై సాధన చేస్తేనే విద్యార్థులు విజయాలు సాదిస్తామన్నారు. క్రీడలతో క్రమ శిక్షణ కలిగి ఉంటారని తెలిపారు ఉత్తమ ఫలితాలు, క్రీడల్లో విజయాలతోపాటు పాఠశాలలకు మంచి పేరు ఉంటుందని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో అందరికి మంచి వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆయన క్రీడాకారులకు కరచాలనం అందించి పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మ హారాష్ట్ర నుంచి 30 పాఠశాలలకు చెందిన వెయ్యి మంది విద్యార్థులు హాజ రయ్యారు. ఈకార్యక్రమంలో బిషప్ జోషఫ్ టప్ ఆఫ్ పరంబత్, ప్రొఫెసర్ ఫ్రాన్సిస్ జేవీఆర్, ప్రొఫెసర్ దూసి రవిశేఖర్, రజిత కాంచనలి పల్లి, హెల్త్‌కేర్ ప్రోవైడర్ నెదర్లాండ్ హజారయ్యారు. ఈపోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. పాఠశాల ప్రాంగణమంతా క్రీడాకారులతో కళకళలాడింది.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

జైపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీదేవి భూ దేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా కొనసాగాయి. ఉదయం నీరాజన సేవలతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహిం చారు. అనంతరం భూదేవి శ్రీదేవి సమేత మాలయపస్వామి వారి కళ్యాణ మహోత్సవం శాస్త్రోంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కల్యాణం అనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేక రథంపై గ్రామ వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వేషాధారణలో కోలాటాలు ఆడుతూ సందడి చేశారు. బ్రహ్మోత్సవాల అనంతరం నిర్వహకులు అరవిందరావు అన్నదానం చేశారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. పూజ కార్యక్రమాలను జమ్మికుంటకు చెందిన అర్చకులు రామాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.

వేతనాలు ఇప్పించాలని వినతి

కోటపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తమకు రావాల్సిన వేతనాలను త్వరగా ఇప్పించాలని కోరుతూ సోమవారం మండలంలోని ఉపాధి హామీఫీల్డ్ అసిస్టెంట్‌లు ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఉపాధి హామీపథకంలో గత 2006 సంవత్సరం నుంచి ప నిచేస్తున్నామని ప్రస్తుతం 22 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉండగా తమకు జులై నెల నుంచి వేతనాలు అందలేదని, దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. జీతాలు లేక తమ కుటుంబ జీవన కష్టమవుతుందని ప్రభుత్వానికి తమ విషయాన్ని తెలిపి తమకు వేతనాలు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల బీమా పెంపు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : భవన ఇతర నిర్మాణ కార్మికులకు సంబంధించిన బీమా పెరిగిందని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో బీమా పెంపునకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాద బీమా కింద లబ్ధి మొత్తాన్ని రూ. 6 లక్షల నుంచి 10 లక్షలకు, సహజ మరణం కింద లబ్ధి మొత్తాన్ని లక్ష రూపాయల నుంచి రూ. 2 లక్షల వరకు పెరిగిందన్నారు. దీనిపై సంబంధిత అధికారులు డిసెంబరు 3 వరకు అవ గాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అర్హులైన కార్మికులు మీ సేవ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, సహాయ కార్మిక కమిషనర్ నరసింహాస్వామి, సహాయ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ఘటనపై విచారణ



విద్యార్థులను విచారిస్తున్న జిల్లా ఇన్‌చార్జి అధికారి మహేశ్వర్‌రావు

రామకృష్ణాపూర్, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): గురుకుల సాంఘీక సంక్షేమ పాఠశాలలో విద్యార్థులను కొట్టిన పీఈటీ నిర్వాకం పై సోమవారం జిల్లా అధికారులు విచారణ వేగవంతం చేశారు. కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి అధికారి మహేశ్వర్‌రావు, జిల్లా కోఆర్డినేటర్ రామ కల్యాణి, ఇన్‌చార్జి జోనల్ అధికారి గిరిజ పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమక్షంలో సంఘటనకు గల కారణాలు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల విద్యార్థులను కొట్టడం సరికాదని తల్లిదండ్రులు, అధికారులకు విన్నవించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులపై జరుగుతున్న వరుస సంఘటనలపై రాష్ట్ర సీపీఐ నాయకులు రా మడుగు లక్ష్మన్, జిల్లా నాయకులు మిట్టపల్లి శ్రీనివాస్ వెంటనే సంబంధిత ఉపాధ్యాయునిపై చర్యలు చేపట్టాలని లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రేమలత, పట్టణ ఇన్‌చార్జి ఎస్ఐ నూనె శ్రీనివాసలు ఉన్నారు.

బీసీలను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

బీసీ సంఘం నాయకుల రాస్తారోకో



ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీసీ సంఘం నాయకులు

జన్నారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 42శాతం రిజర్వేషన్ అమలు పరుచకుండానే బీసీలను మోసం చేసిందని బీసీ సంఘం నాయకులు ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ కన్వీనర్ కోడూరి చంద్రయ్య, మున్నూర్ కాపు సంఘం మండల అధ్యక్షులు కాశెట్టి లక్ష్మన్ మాట్లాడుతూ బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో తీరని నష్టం వాటిల్లిందని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం పూర్తి స్థాయిలో విఫలమైందని ఆరోపించారు. మండలంలో ఉన్న 29 గ్రామ పంచాయతీల్లో కేవలం 2 గ్రామ పంచాయతీలో బీసీలకు రిజర్వు చేయడం ఎంత వరకు సరైందన్నారు. బీసీ దామాషా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు ప్రకటించాలని అన్ని గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ ఎన్నికలను బహిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో ఉమర్‌షరీఫ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కొంతం శంకరయ్య, బాలసాని శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీనారాయణ, జనార్దన్, సుతారి వినయ్, రాకేశ్, జలపతి, గోపాల్ సీపీఎం నాయకులు అశోక్, జయ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



సాత్విక్ (ఫైల్)

చెన్నూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కత్తెరసాల గ్రామం వద్ద సోమ వారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కుమ్మరి సాత్విక్ (యోగి) (12) దుర్మరణం చెందాడు. సీఐ వాసుదేవరావు వివరాల ప్రకారం కోటపల్లి మండలం ఆల్గామ గ్రామానికి చెందిన కుమ్మరి రాజయ్య తన కుమారుడు సాత్విక్‌తో కలిసి చెన్నూరు మండలం చెల్లాయిపేట గ్రామంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరయ్యాడు. తిరిగి తన స్వగ్రామైన ఆల్గామకు వెళ్తున్న క్రమంలో చెన్నూరు మండలం కత్తెరసాల వద్ద చెన్నూరు నుంచి ఆస్నాద వైపు వెళ్తున్న లారీ (ఏపీ 20టీసీ0788) బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింటి. దీంతో బైక్‌పై ఉన్న రాజయ్య కింద పడి పోగా సాత్విక్ లారీ వెనక టైరు కింద పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. సాత్విక్ జైపూర్ మండలంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు.

బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా ధర్నా



మంచిర్యాలలో ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బూటకపు ఎన్‌కౌం టర్‌లకు నిరసనగా సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ప్రజా సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ నాయకుడు, మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా, ఇతర మావోయిస్టు నాయకులను బూటకపు ఎన్ కౌంటర్‌లో చంపడం దారుణమన్నారు. 23 నెలలుగా కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం హత్యకాండను కొనసాగిస్తుందని, ఇది సరైంది కాదన్నారు. కేంద్రం ఈ విధానాలను మానుకోవాలన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రాయమల్లు, అంజన్న, జైపాల్‌సింగ్, చందు, రాజయ్య, మంగ, రాజయ్య, సత్యం, రాములు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల ప్రభావాన్ని నియంత్రించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు, యువత భవిష్యత్‌పై మాదక ద్రవ్యాల ప్రభావాన్ని నియంత్రించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, వినియోగాలను నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. మత్తు పదార్థాలు వినియోగించడం వల్ల కలిగే నష్టాలను అర్థమయ్యేలా ర్యాలీలు, చిత్రలేఖనం, వ్యాస రచన, క్లబ్ ఏర్పాట్లు వివిధ రకాల పద్ధతుల ద్వారా అవగాహన కల్పించాలన్నారు.

పాఠశాలల్లో ఉపాధ్యాయులు మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరించాలని, వారి ప్రవర్తనలో మార్పులను గమనించాలన్నారు. మందుల దుకాణాలు, ఆసుపత్రుల్లో అందించే గుర్తించిన ప్రత్యేకమైన డ్రగ్స్‌పై రిజిష్టర్ నిర్వహించాలని, వైద్యుల సూచన మేరకు మాత్రమే మందులు విక్రయించాలని తెలిపారు. చట్ట విరుద్ధంగా గంజాయి, మద్యం, సిగరెట్లను విక్రయించే లైసెన్స్ లేని దుకాణాలను సీజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ఆర్డీవో శ్రీనివాసరావు, ఏసీపీలు వెంకటేశ్వర్లు, రవికుమార్, జిల్లా అబ్కారీ, మద్యనిషేధ అధికారి నందగోపాల్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చందన పాల్గొన్నారు.

తప్పుల తడకగా బీసీ రిజర్వేషన్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తప్పుల తడకగా బీసీ రిజర్వేషన్‌లను కేటాయించి బీసీలకు అన్యాయం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. రిజర్వేషన్‌లను సవరించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

మంచిర్యాల జిల్లాలో 306 సర్పంచు స్థానాలు ఉంటే కేవలం 21 స్థానాలు మాత్ర మే బీసీలకు కేటాయించారన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇస్తామని జీవో ఇచ్చి బీసీలను నయవంచనకు గురి చేస్తుందన్నారు. 42 శాతం రిజర్వేషన్ హామీని విస్మరించి ప్రభుత్వం బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందన్నారు. వెంటనే రిజర్వేషన్‌ల అమలు చేసి బీసీలకు న్యాయం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, శ్రీదేవి, కమలాకర్‌రావు, రామయ్య, నాగేశ్వర్‌రావు, రాజ్‌కుమార్, చక్రవర్తి, రమేష్, సుమన్ యాద్, చిరంజీవి పాల్గొన్నారు.